క్లుప్తంగా

ప్రత్యేక ప్రార్థనలు


మైనార్టీ పెద్దలతో నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎం–1 పంచాయతీలోని జామియా మసీదులో శుక్రవారం రంజాన్‌మాసం పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక ముస్లిం మైనార్టీలతో కలిశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచు మస్తాన్‌సోహెల్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.ఎ.కరీముల్లా, మొహమ్మద్‌యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై గట్టు వెంకటేశ్వరస్వామి


గజవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

రామసముద్రం : మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీ గట్టు వెంకటేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారు గజవాహనంపై ఊరేగారు. ఉదయం స్వామివారికి ప్రత్యేకపూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ అర్చకులు రామచంద్ర భట్టర్ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా రథోత్సవం


రథంపై పార్వతీ సమేత చంద్రశేఖరస్వామి

రామసముద్రం : మండల కేంద్రంలోని దిగువపేటలో వెలసిన శ్రీ ప్రసన్న పార్వతీ సమేత చంద్రశేఖరస్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు బాలాస్వామి, రవిస్వామిలు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఉంచి బ్యాండు వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఇంటింటా భక్తులు కర్పూరహారతులు అందించి మొక్కులు చెల్లించారు.

రంజాన్ తోఫా పంపిణీ


రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న న్యాయవాది షౌకత్‌అలి

పీలేరు : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పేద ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. శుక్రవారం ప్రముఖ న్యాయవాది షౌకత్ అలి, ఇబ్రహీం ముస్లిం పేదలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవారు సంతోషంగా పండుగ జరుపుకోవడానికి గోధుమ పిండి, చక్కెర, కందిపప్పు, సేమియాలు, నూనె తదితర వస్తువులు అందజేశామన్నారు.

గ్రామోత్సవం

నందలూరు : మండలంలోని గొల్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆవాహిత పూజలు, యంత్రాభిషేక తదితర పూజలు నిర్వహించారు. పూజల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం గొల్లపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి రామాలయం వరకు రాముడు, లక్ష్మణుడు, సీత, వినాయకుడు, శ్రీకృష్ణుడు విగ్రహాలను వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

గాలివీడు : రోడ్డుపై ఆటోలు నడిపేటప్పుడు రహదారి భద్రతా నియమాలను ఆటో డ్రైవర్లు, యజమానులు పాటించాలని ఎస్‌ఐ రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని పశువుల సంత ఆవరణలో ఆటో డ్రైవర్లు, యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు యూనిఫామ్, లైసెన్స్ తప్పనిసరి అని చెప్పారు.

ఫుల్ జోష్‌లో హోలీ సంబరాలు


అయ్యప్పస్వామి ఆలయంలో హోలీ వేడుకలు


వెలుగు పాఠశాలలో రంగు చల్లుకుంటున్న విద్యార్థులు, వృద్ధులు


హోలీ సంబరాలు చేసుకుంటున్న రాజస్థానీలు

మదనపల్లె సిటీ : మదనపల్లెలో శుక్రవారం హోలీ వేడుకలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో మలికాపురత్తమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. భక్తులు పసుపు,కుంకుమ కలిపిన రంగులనుల చల్లుకుని ఆనందోత్సవాలలో హోలీ నిర్వహించారు. స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో హోలీ పండుగను చిన్నారులు, వృద్ధులు కలిసి ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగు చల్లుకుంటూ కేరింతలు నడుమ ఆటపాటలతో నిర్వహించారు. ప్రాంగణమంతా రంగులతో హోలీ పండుగ వాతావరణం నెలకొంది. వెలుగు పాఠశాల కన్వీనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ హోలీ అంటే రంగులని, రంగులు అంటే గుణాలని, మనం ఒకరినొకరు రంగులు చల్లుకోవడం అంటే ఒక్కొక్కరిలోని మంచి గుణాలని మనం స్వీకరించడమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీనాకుమారి సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు రూరల్ : పీలేరులో హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ప్రధానంగా రాజస్థాన్‌కు చెందిన కుటుంబాలు, యువకులు శుక్రవారం రంగులు చల్లుకుని హోలీ జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ హిరణ్యకశ్యపుని చెల్లెలైన హోలిక అనే రాక్షసి ప్రహ్లాదుడిని మంటల్లో వేసింది. అయితే విష్ణుభక్తుడైన ప్రహ్లాదుడు దైవ లీలతో అపార భక్తితో ఎటువంటి గాయాలు లేకుండా బయటుపడతారన్నారు. హోలికను దహనం చేస్తూ భోగిమంటలు వేయడం, రంగులు చల్లుకుని సంబరాలు జరుపుకోవడం వసంతకాలంలో ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

ఉత్సాహంగా హోలీ

బి.కొత్తకోట : పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై శుక్రవారం హోలీ వేడుక ఉత్సాహంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు, స్థానికులు, చిన్నారులు, ప్రభుత్వశాఖల సిబ్బంది రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందడితో కొండపై ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.

భక్తులతో ఆలయాలు కిటకిట


తుమ్మరకుంటలోని పురాతన ఆలయంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

పెద్దతిప్పసముద్రం : పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మండలంలోని శ్రీ నరసింహ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. మండలంలోని తుమ్మరకుంటలో కొండ కింద వెలసిన పురాతన కాలం నాటి నరసింహస్వామి ఆలయం, మల్లెల పంచాయతీ గొందిపల్లి సమీపంలోని కదిరి గుట్టపై వెలసిన నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వందలాదిగా ప్రజలు తరలి వచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు.

కలకడలో..

కలకడ : మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ బీసీ కాలనీలో వెలసిన శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ఆలయ ధర్మకర్త యల్లప్ప స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, భజనలు, పూజల్లో అనేక మంది భక్తులు పాల్గొన్నారు. స్వామివారికి ఆకుపూజ అలంకరణ అనంతరం అన్నదానం చేశారు.

పౌర్ణమి పూజలు

మదనపల్లె సిటీ: కదిరి పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక శ్రీవారినగర్‌లోని శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి,అమ్మవార్లకు పంచలోహ కవచములతో అలంకారం చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులు తీర్థప్రసా దాలు అందజేశారు. మదనపల్లె మండలం సీటీఎంలో వెలసిన శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయంలో పౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రపంచ గతిని మార్చిన యోధుడు కార్ల్ మార్క్స్

బాస్ నేత పీటీయం శివప్రసాద్


కార్ల్‌మార్క్స్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న బాస్ నాయకులు

మదనపల్లె : సామాజిక, ఆర్థిక, రాజకీయ విప్లవాలకు బాటను ఏర్పరిచి, ప్రపంచ గతిని మార్చిన విప్లవ యోధుడు కార్ల్ మార్క్స్ అని బాస్ వ్యవస్థాపకుడు పీటీయం శివప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక బాస్ కార్యాలయంలో సోషలిస్టు విప్లవయోధుడు కార్ల్‌మార్క్స్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాస్ ప్రతినిధులు కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) వ్యవస్థాపకులు పీటీయం శివప్రసాద్ మాట్లాడుతూ.. ప్రస్తుత జర్మనీలోని ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన మార్క్స్ రాజకీయ ఆర్థిక శాస్త్రం, హెగెలియన్ తత్త్వశాస్త్రం చదువుకున్నారని చెప్పారు. యుక్త వయసులో ఏ దేశపు పౌరసత్వమూ లేని స్థితిలో, లండన్ లో జీవితం గడిపారన్నారు. లండన్‌లో మరో జర్మన్ ఆలోచనాపరుడైన ఫెడెరిక్ ఏంగెల్స్ తో కలిసి తన చింతననుఅభివృద్ధి చేసుకుంటూ పలు పుస్తకాలు ప్రచురించాడని చెప్పారు. 1848 నాటి కరపత్రమైన 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో' వాటన్నింటిలో సుప్రసిద్ధమైనదని, తదుపరి కాలపు మేధో, ఆర్థిక, రాజకీయ చరిత్రను ఈ కమ్యూనిస్ట్ మేనిఫెస్టో ఎంతో ప్రభావితం చేసిందని చెప్పారు. జర్మన్ శాస్త్రవేత్తగా, తత్త్వవేత్తగా, సామాజిక వేత్తగా, పాత్రికేయుడిగా, సోషలిస్టు విప్లవ కారుడిగా కార్ల్ మార్క్స్ ప్రపంచానికి చిరస్మరణీయ సేవలు అందించారని కొనియాడారు. నేటి యువత ఆయన పుస్తకాలను అధ్యయనం చేసి, ఆయన స్ఫూర్తితో సమాజ మార్పుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, కోశాధికారి నీరుగట్టి రమణ తోపాటు బాస్ నాయకులు మీసాల గంగులు, క్రాంతి, ఎస్. లక్ష్మీనారాయణ, వై. గంగాధర్, బి.నరసింహులు, ప్రశాంత్, శరత్, అభి తదితరులు పాల్గొన్నారు.

చింతకుంటమ్మ తిరునాలకు విరాళం

సుండుపల్లె : మండల పరిధిలోని చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ పూజారివాండ్లపల్లెలో వెలసిన చింతకుంటమ్మ తిరునాలకు రాజంపేట నియోజకవర్గ వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు గాలివీటి విజయసాగర్‌రెడ్డి (మదన్‌రెడ్డి) రూ.19,500, సర్పంచ్ రామాజయచంద్ర రూ.2,516 నగదును గ్రామ ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ కలసిమెలసి తిరునాలను జరుపుకోవాలని సూచించారు. ఆలయ పూజారి నాగరాజ, శ్రీకాంత్, ఆరంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో వరుస చోరీలు

గుర్రంకొండ : మండలకేంద్రమైన గుర్రంకొండ బస్టాండులో జరిగిన వరుస చోరీలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. వ్యాపారకేంద్రంగా అభివృద్ధి చెందిన గుర్రంకొండ పట్టణం నడిబొడ్డున బస్టాండు ఉంది. ఈ బస్టాండులో వందలాది మంది వ్యాపారాలు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో గత రాత్రి జరిగిన వరుస మూడు చోరీలతో అటువ్యాపారులు ఇటు ప్రజలు హడలెత్తిపోతున్నారు. స్థానిక పోలేరమ్మ వీధికి వెళ్లే బస్టాండు మార్గంలో ఉన్న ఎలక్ట్రికల్ దుకాణానికి పెద్ద రంధ్రం చేసి అందులో నుంచి లోపలికి వెళ్లి రూ. 10 వేలు, రూ.60 వేలు విలువచేసే ఇతర వస్తువులను దొంగలు చోరీ చేసుకెళ్లారు. ఇదే బస్టాండులో పాత పోలీస్‌స్టేషన్‌కు పక్కనున్న ఓ చిల్లర దుకాణానికి రంధ్రం చేసి అందులోకి ప్రవేశించి రూ.50 వేల నగదు, కొన్ని సరకులు దోపిడీ చేశారు. బస్టాండు నుంచి శ్రీపోలేరమ్మ వీధికి వెళ్లే మార్గంలో సయ్యద్‌షావలీ అనే వ్యక్తికి చెందిన చిల్లర దుకాణానికి కన్నం వేసి అందులో ఉన్న రూ. 60 వేల నగదు, రూ.36 వేలు విలువచేసే సిగరెట్లతో పాటు ఇతర సరకులు చోరీ చేసుకెళ్లారు. ఇలా వరుసగా మూడు దుకాణాల్లో దుండగులు చోరీలకు పాల్పడడంతో జనం, వ్యా పారులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండే బస్టాండులోనే దొంగలు వరుస చోరీలకు పాల్పడుతూ హల్ చేస్తుండడం గమనార్హం. జరిగిన చోరీలపై బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వ్యాపారంలో నిజాయితీతో ముందుకు సాగాలి


సీఐ గురునాథను సన్మానిస్తున్న మెకానిక్ యూనియన్ నాయకులు

కలకడ : ద్విచక్రవాహనం, నాలుగు చక్రాల వాహనాల మెకానిక్‌లు నిజాయితీతో కూడిన వ్యాపారం చేసి వినియోగదారుల (కస్టమర్లు) వద్ద మంచిపేరు తెచ్చుకుని ముందుకు సాగాలని కలకడ సీఐ గురునాథ అన్నారు. శుక్రవారం కలకడలోని నవ్యాంధ్ర టూవీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ సభ్యులు సీఐని సన్మానించారు. ఈ సందర్భంగా టూవీలర్ యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్‌రఫీ, కార్యదర్శి ముయూన్ ఆధ్వర్యంలో కార్మికులకు అందించే గుర్తింపు కార్డులు, సంఘం నుంచి పొందే బీమా, సభ్యుల కోసం ఐకమత్యంతో చేసే పనులు సీఐ దృష్టికి తీసుకువచ్చారు. సీఐ మాట్లాడుతూ చోరీకి గురైన వాహనాలు కొనుగోలు చేయరాదని సూచించారు. చోరీకి పాల్పడే వ్యక్తుల ఆచూకీ తెలిసినా, అనుమానం వచ్చిన సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రియాజ్‌బాషా, హసన్‌బాషా, ఇమామ్‌హుస్సేన్, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

ఈ వంతెనకు 96 ఏళ్లు


పెద్దేరు వంకపై ఏళ్లనాటి చెక్కు చెదరని వంతెన

- ప్రమాదం జరగక ముందే మేల్కోండి
- వంతెనపై సామర్థ్యంకు మించి బరువుతో వాహనాల రాకపోకలు
- సూచిన బోర్డు ఏర్పాటు చేయాలని వినతి

పెద్దతిప్పసముద్రం : పీటీఎం తిప్పరాయ చెరువు మొరవనీరు పారే పెద్దేరు వంకపై శ్రీకృష్ణదేవరాయుల కాలంలో ఆంగ్లేయులు భారీ రాతి కట్టడంతో నిర్మించిన వంతెన ఇప్పటికీ చెక్కు చెదరలేదు. 1929లో కట్టిన ఈ వంతెన 96 ఏళ్ళు పూర్తి చేసుకుంది. స్థానిక బి.కొత్తకోట రోడ్డులోని చిన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నున్న రహదారిలో నిర్మించిన ఈ వంతెనను అప్పటి ఉమ్మడి జిల్లా జిల్లా కలెక్టర్ జీఎఫ్ బ్రాకెన్‌బర్లీ లాంఛనంగా ప్రారంభించారు. అప్పట్లో ఈ వంతెనపై 10 టన్నుల సామర్థ్యం గల వాహనాలు సునాయాసంగా వెళ్ళవచ్చని అధికారులు పేర్కొన్నారు. అయితే గత ఐదేళ్ల క్రితం బి.కొత్తకోట–ములకలచెరువు వయా పీటీఎం మీదుగా రోడ్డు విస్తరణ పనులు జరిగాయి. ఆ సమయంలో వంతెనకు ఒక వైపు కొంచెం విస్తరణ చేసి పిల్లర్ల పనులు చేపట్టే సమయంలో ఏళ్ల చరిత్ర ఉన్న శిలాఫలకాన్ని ఆనవాళ్ళు లేకుండా భూ స్థాపితం చేయడం దురదృష్టకరం. ఇదిలా ఉండగా ఈ రహదారిలో 10 నుంచి 30 టన్నులకు పైగా సామర్థ్యం గల భారీ వాహనాలు బెంగళూరు, హైదరాబాద్, కడప, అనంతపురానికి నిత్యం పదుల సంఖ్యలో వెళుతుంటాయి. వంతెనకు ఎలాంటి ప్రమాదం సంభవించినా రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయి. ఎలాంటి ప్రత్యామ్నాయ సౌకర్యాలు కూడా లేవు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే మేల్కొని వంతెన కెపాసిటి, ఎన్ని టన్నుల బరువు ఉన్న వాహనాలు వంతెనపై వెళ్ల వచ్చు, టన్నేజి వివరాలతో కూడిన సూచిక బోర్డును ఏర్పాటు చేసి వంతెనకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థినికి బంగారు పతకంతో సత్కారం


కావలి చైత్రను సత్కరిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పీలేరు : గత ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలో విశేష ప్రతిభ కనబరచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని కావలి చైత్రను శుక్రవారం బంగారు పతకంతో సత్కరించారు. ఎంఈవో పద్మావతి ప్రతి ఏటా స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థినులను బంగారు పతకంతో సత్కరిస్తున్నారు. ఈ క్రమంలో 2023–24 విద్యా సంవత్సరానికి మండలంలోని వేపులబైలుకు చెందిన కావలిచైత్ర అత్యధిక మార్కులు సాధించింది. కార్యక్రమంలో హెచ్‌ఎం ఫౌజియా బేగం, టీచర్లు విజయకుమారి, జానం సుజాత, హారిక, అంజమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉజ్వల భవితకు బంగారుబాట వేసుకోవాలి


పాఠశాల వార్షికోత్సవ పూజా కార్యక్రమంలో ఉపాధ్యాయులు

కేవీపల్లె : విద్యార్థులు ఉజ్వల భవితకు బంగారుబాట వేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు టి. సాహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నూతనకాల్వ పంచాయతీ సీకేఆర్‌పల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై స్వచ్ఛత ఇదేనా?


హార్సిలీహిల్స్‌పై పొదల్లో వదిలేసిన చెత్త తరలించే బండి

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పారిశుద్ధ్య పనుల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండు చెత్త తరలించే స్వచ్ఛ సంకల్పం బండ్లను కేటాయించింది. రోజూ పారిశుద్ధ్య పనులు చేసేందుకు ముగ్గురు కార్మికులను నియమించగా పనులు చేసేవారు. కొండపై చెత్త కనిపించకుండా మెరుగైన పారిశుద్ధ్యం అమలు చేయడం జరిగేది. కూటమి ప్రభుత్వం వచ్చాక కొండపై పారిశుద్ధ్య పనులు పడకేశాయి. ముగ్గురు కార్మికులను ఇక్కడి నుంచి మరోచోటికి పంపేశారు. చెత్త సేకరణ బండ్లను ఇలా పొదల్లో వదిలేశారు. ఇప్పుడీబండ్లు శిథిలమైపోయాయి. వాటిని వినియోగించుకునే స్థితిలో లేవు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి నియామకం

రామసముద్రం : మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కే.సీ.పల్లెకు చెందిన సీఆర్.సతీష్‌రెడ్డిని నియమిస్తూ శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ గాజులభాస్కర్, సతీష్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆదేశాలు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి సహకారంతో పార్టీ అభివృద్ధి కోసం గ్రామస్థాయి నుంచి కృషి చేస్తానన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడి

తంబళ్లపల్లె : మండలంలో విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం నుంచి ఒంటిపూట బడి నిర్వహించనున్నట్లు ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు తెలిపారు. వేసవిలో ఎండలు ఎక్కువగా ఉండటంతో ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తారన్నారు. 10వ తరగతి పరీక్షా కేంద్రాల పాఠశాల్లో మాత్రం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తులు

తంబళ్లపల్లె : మండలంలోని అర్హులైన మహిళలు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ పొందేందుకు ఈనెల 22వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి కోరారు. తెల్లరేషన్‌కార్డు కలిగి 18 సంవత్సరాలు పైన 50 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఆధార్, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రాలతో సంబంధిత గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 45 రోజుల శిక్షణలో రోజుకు 8 గంటలు, 60 రోజుల శిక్షణలో రోజుకు 6 గంటలు, 90 రోజుల శిక్షణలో రోజుకు నాలుగు గంటల పాటు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసి 75 శాతం హాజరు ఉన్నవారికి ప్రభుత్వం తరపున ఉచితంగా కుట్టుమిషన్ పంపిణీ చేస్తారన్నారు. అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చేనేత కార్మికులకు పింఛన్లు అమలు చేయాలి

మదనపల్లె సిటీ : చేనేతరంగాన్ని నమ్ముకున్న 45 ఏళ్ల చేనేత కార్మికులకు పింఛన్లు అమలు చేయాలని బీసీసంక్షేమ సంఘం చేనేత రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు వీరభాస్కర్ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో చేనేత రంగంపై అధికంగా జీవనం సాగిస్తున్నారన్నారు. చేనేతరంగాన్ని నమ్ముకున్నారన్నారు. పింఛన్లు మంజూరు చేసి న్యాయం చేయాలన్నారు.

మిట్స్ విద్యార్థుల ప్రతిభ

కురబలకోట : అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు ఎస్. గౌతమి, ఎస్. నీలవేణి, పి. మనోజ్‌కుమార్, వి. సయ్యద్ నౌషాద్ జాతీయ స్థాయిలో బహుమతి అందుకున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ శుక్రవారం తెలిపారు. కడపలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల నిర్వహించిన జాతీయ సాంకేతిక సింపోజియం 2కె25లో ప్రాజెక్టు ఎక్స్‌పో పోటీలో బహుమతి లభించినట్లు తెలిపారు.